నమస్తే తెలంగాణ

# వికారాబాద్

హైదరాబాద్, బుధవారం 25 జూన్ 2025 VIKARABAD

## డ్రగ్స్‌ను కట్టడి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 24 : ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌ను కట్టడి చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించి నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అటువంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ హనుమంత్‌రావు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆక్రమణలను తొలగిస్తాం..



మాసబ్ చెరువు నాలాను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

తుర్కయాంజాల్ : నాలాల కబ్జాలపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్‌చెరువు, దిలావర్‌ఖాన్ చెరువుల నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారి తిరుమలేశ్ మాట్లాడుతూ..మాసబ్‌చెరువు, దిలావర్‌ఖాన్ చెరువుల నాలాలపై పలుచోట్ల అక్రమ నిర్మాణాలను గుర్తించామని.. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి వాటిని తొలగిస్తామన్నారు. మాసబ్‌చెరువు నాలాపై ఆపిల్ ఎవెన్యూ కాలనీలో రోడ్డు వేసినట్లు గమనించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ శివకృష్ణ, ఏఈఈ వంశీ, సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పోరు..

## ఆ తొమ్మిది మండలాల రైతులకు రైతుభరోసా

# దిగొచ్చిన సర్కారు..





### మంగళ వారం సాయంత్రం నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ

రంగారెడ్డి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పోరాటం ఫలించింది. జిల్లాలోని శివారు ప్రాంతాల రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయం వారి ఖాతాల్లో జమ అవుతున్న ది. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో వ్యవసా యం చేయడంలేదన్న సాకుతో రాష్ట్ర ప్రభు త్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని నిలిపేయగా.. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆ తొమ్మిది మండలాల్లో సాగవుతున్న వరి, కూరగాయల పంటలకు సంబంధించిన పూర్తి ఆధారాలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందించి.. రైతుభరోసా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. శివారు మండలాల రైతుభరోసాపై సమీక్షిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించకపోవడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామా ల్లో రైతు భరోసా ఇవ్వాలని ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి ఆధ్వర్యం లో తులేకలాన్, మాజీ ఎంపీపీ కృపేశ్, మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు ఆధ్వర్యంలో ఎలిమినేడులో, ఉప్పరిగూడ గ్రామాల్లో ఆందోళనలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం మంగళవా రం రైతు వేదికల్లో నిర్వహించిన సంబురాల్లో భాగంగా శివారు ప్రాంతాల రైతులకూ రైతుభరోసా ఇస్తున్నట్లు ప్రకటించి..ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం తదితర ప్రాం తాల్లోని రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయడం ప్రారంభించింది. బుధవారం సాయంత్రంలోగా మిగిలిన రైతులకు రైతుభరోసా అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు.

### 43,000 మందికి రూ.55 కోట్లు..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, గండిపేట, శంషాబాద్ మండలాల్లోని సుమారు 43,000 మం ది రైతులు రైతుభరోసాకు అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ రూ. 55 కోట్లను రైతుభరోసాగా అందించాలని ప్రభుత్వం ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేసింది.



### బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే..

జిల్లాలోని తొమ్మిది శివారు మండలాల్లో వ్యవసాయం చేయడంలేదన్న సాకుతో ప్రభుత్వం రైతుభరోసాను ఎగ్గొట్టాలని యత్నించింది. అయితే దీనిపై తాము వెంటనే స్పందించి శివారు మండలాల్లో సాగవుతున్న పంటల వివరాలను పూర్తి ఆధారాలతో ప్రభుత్వానికి అందించాం. రైతులకు కచ్చితంగా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాలని..లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించాం. అయినా ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అనుసరించడంతో అనేక గ్రామాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దిగొచ్చి రైతుభరోసాను విడుదల చేసింది. కానీ, అర్హులందరికీ ప్రభుత్వం రైతుభరోసా పంపిణీ చేయకుండానే సంబురాలు చేసుకోవడం ఆక్షేపణీయం. కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చి అన్ని వర్గాలను మోసం చేస్తున్నది. కాంగ్రెస్ హయాంలో వ్యవసాయం దండుగలా మారింది. రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. కొందరికే చేసింది. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని, ఇప్పటికీ రైతులకు ఇవ్వలేదు. రైతులకు వెంటనే బోనస్ పంపిణీ చేయాలి. లేకుంటే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తాం.

-సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే



### వ్యవసాయ మంత్రికి వినతిపత్రమిచ్చాం..

తొమ్మిది మండలాల రైతులకు రైతుభరోసా పంపిణీ చేయాలని బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనలకు ప్రభుత్వం దిగివచ్చింది. అవుటర్ చుట్టు పక్కల ఉన్న తొమ్మిది మండలాల్లో వ్యవసాయం సాగవుతున్నదని.. వారందరికీ పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాలని మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రికి వినతిపత్రాన్ని ఇచ్చాం. ప్రభు త్వం రైతుభరోసా ఇవ్వకుంటే నేటి నుంచి ఆందోళనను తీవ్రతరం చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వం దిగిరావడంతో విరమించాం.

-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి,
బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



కడ్తాల్ : గట్టుఇప్పలపల్లి గ్రామంలోని రైతు వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

## అరకొర పెట్టుబడి సాయంపై

# అన్నదాత ఆగ్రహం

- నాలుగెకరాలు ఉన్న రైతుకు 52 గుంటల భూమికే రైతుభరోసా
- రెండెకరాలు ఉన్న రైతుకు 18 గుంటల భూమికే పెట్టుబడి సాయం జమ
- మిగిలిన డబ్బులు ఎప్పుడంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..
- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న రైతులు

మంచాల/కడ్తాల్, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నది. తమకు ఉన్న భూమి మొత్తానికి రైతుభరోసా సాయం బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అన్నదాతలు వ్యవసాయ అధికారులను నిలదీస్తుండడంతో వారు త్వరలోనే డబ్బులు వస్తాయని చెప్పి తప్పించుకుంటున్నారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలతోపాటు ఆరు అనుబంధ గ్రామాల్లో 32,000 ఎకరాల భూమి ఉన్నది. అందులో 17,800 రైతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. మంచాలకు చెందిన బీరప్పకు నాలుగు ఎకరాల భూమి ఉండగా.. అందులో 52 గుంటల భూమికి మాత్రమే బ్యాంకు ఖాతాలో పెట్టుబడి సాయం కాగా.. జాపాల గ్రామానికి చెందిన బక్కన్న చంద్రకాంత్‌కు రెండు ఎకరాల భూమి ఉండగా.. 18 గుంటల భూమికి మాత్రమే డబ్బులు పడ్డాయని.. మిగిలిన భూమికి ఎప్పుడు డబ్బులు వస్తాయని వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్నారు. వీరిద్దరితోపాటు మండలంలో పలువురు రైతులకూ పెట్టుబడి సాయం భూమి మొత్తానికి కాకుండా కొంతనే జమకావడంతో మంచాల రైతు వేదికలో ఉన్న వ్యవ సాయాధికారులను వారు నిలదీయగా.. త్వరలోనే వస్తాయని వారు సర్ది చెప్పారు. గత బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు డబ్బులు సీజన్‌కు ముందే తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని.. రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత రైతుభరోసాను అరకొరగా పంపిణీ చేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రెండెకరాలుంటే ఎకరానికే..



నాకు రెండెకరాల భూమి ఉండగా.. అందులో ఎకరం భూమికి మాత్రమే రైతుభరోసా పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో జమ అయింది. మిగిలిన భూమికి డబ్బులు ఎప్పుడిస్తారని వ్యవసాయాధికారులను అడిగితే వారు సరైన సమాధానం చెప్పడంలేదు. గత కేసీఆర్ ప్రభుత్వం అర్హులందరికీ రైతుబంధు అందించి ఆదుకున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందర్ని ఆగం చేస్తున్నది. -మొగిలి వెంకటేశ్, మంచాల

## మాకేదీ రైతుభరోసా ..?

కడ్తాల్ : రైతుభరోసా డబ్బులు తమ బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదని తలకొండపల్లి మండలానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు రైతువేదిక ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ..భూమి ఉన్న కానీ.. తమ బ్యాంక్ ఖాతాల్లో రైతుభరోసా పెట్టుబడి సాయం జమ కాలేదన్నారు. పంటల సాగు వివరాల నమోదు సమయంలో ఆయా పొలాల్లో ఎలాంటి పంట వేయలేదని..అందుకే రైతు భరోసా డబ్బులు పడలేదని అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో రెండు సీజన్లలోనూ పంట పెట్టుబడి సాయం అందిందని రైతులు గుర్తు చేశారు. రైతుల డబ్బులను ఎగ్గొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గౌడ సంఘంనియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, అనిల్, శరత్‌చంద్ర, ఆంజనేయులు, ప్రభాకర్‌గుప్తా, శ్రీను, రైతులు పాల్గొన్నారు.



మంచాల రైతు వేదికలో రైతు భరోసా డబ్బులు జమ కాలేదని అధికారులను అడుగుతున్న రైతులు

# పర్మినెంట్‌ను పక్కన పెట్టి.. అవుట్‌సోర్సింగ్‌కు పట్టం కట్టి..

- రంగారెడ్డి జిల్లాలోని కీలక విభాగాల్లో తిష్ట వేసిన ఉద్యోగులు
- కొన్నేండ్లుగా పాతుకుపోవడంతో అన్ని డిపార్ట్‌మెంట్లపై పట్టు
- ఉన్నతాధికారుల వైఖరిపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

పనులు కావాలంటే వారి చేతులు తడపాల్సిందే..



రంగారెడ్డి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని కీలక ప్రభుత్వ కార్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హవా సాగుతున్నది. అధికారులు పర్మినెంట్ ఉద్యోగులను పక్కనపెట్టి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగిస్తుండడంతో అవినీతి జరిగే అవకాశమున్నదని ఆరోపణలొస్తున్నా.. పై స్థాయి అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రిజిస్ట్రేషన్ వంటి కీలక కార్యాలయాల్లో పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నా వారికి కీలక బాధ్యతలు అప్పగించకుండా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే పనులను చేయిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. కీలక శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొన్నేండ్లుగా అక్కడే పాతుకుపోవడం.. అనధికార పనులను అధికారులు వారితోనే చక్కబెట్టుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. జిల్లాలో రెవెన్యూ, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ కార్యాలయాలు కీలకం కాగా.. ఈ ఆఫీసుల్లో పనులు జరగాలంటే చేతులు తడపాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రికార్డుల మార్పు, రిజిస్ట్రేషన్లు తదితరాలను అధికారులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే, మున్సిపల్ కార్యాలయాల్లో భవన నిర్మాణాల అనుమతులు, లైసెన్సుల జారీ వంటి కీలక బాధ్యతలు కూడా వారికే అధికారులు అప్పగిస్తున్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో ఇష్టానుసారం..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల వంటి మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఓ సంస్థకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి లైసెన్స్ జారీతోపాటు డీజిల్, పెట్రోల్ వినియోగం వంటి బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఇతర మున్సిపాలిటీల్లోనూ కీలక పనులను వారే చేపడుతున్నారు.

### అక్రమంగా ఎన్‌వోసీల జారీ..

ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలకంగా మారారు. ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ, లేఅవుట్ల ఏర్పాటులో ఇరిగేషన్ అధికారుల ఎన్‌వోసీ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ధ్రువీకరణ వంటి కీలక బాధ్యతలను వారికి అప్పగించడంతో జిల్లాలో అనేక లేఅవుట్లకు అక్రమంగా ఎన్‌వోసీలను జారీ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చెప్పిందే వేదంలా మారింది.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారే అధికం

జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే అధికంగా ఉన్నారు. వారి కనుసన్నల్లోనే ఈ ఆఫీసులు కొనసాగుతున్నాయి. ముడుపులు లేనిదే పనులు ముందుకు సాగడంలేదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్దఅంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం వంటి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చెప్పిన పనులే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని కీలక ప్రభుత్వ కార్యాలయాలపై కలెక్టర్ దృష్టి సారించి.. సామాన్యులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# టెండర్లలో గోల్‌మాల్

- బడంగ్ పేట కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ల ధర్నా
- టెండర్లలో పారదర్శకత లేదని అసహనం

బడంగ్‌పేట, జూన్ 24 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా లేదని కాంట్రాక్టర్లు ధర్నాకు దిగారు. టెండర్లు రద్దు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో తీర్మానాలు చేసిన 200 పనులకు టెండర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి చేయలేదని వారు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్లలోనూ గోల్‌మాల్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు పట్నం శ్రీశైలం, విజయ్‌కుమార్, సాయికిరణ్, శ్రీనివాస్ తదితరులు ఆరోపించారు. ప్రతిసారీ అడ్వాన్స్ వర్క్‌లు పెట్టడాన్ని వారు తప్పుపట్టారు. అధికారులకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు నామినేట్ పనులు ఇస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే కాంట్రాక్టులు వస్తున్నాయని ఆరోపించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్, డీఈకి తెలియకుండా టెండర్లు తీయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వాళ్లే అర్ధరాత్రి టెండర్లు తీస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు.

### ఒకరిపై ఒకరు ఆరోపణలు..

మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. అత్యవసర విషయంలో అడ్వాన్స్‌గా పనులు చేసిన వాటిని తెలుసుకొని టెండర్ వేసి కమీషన్లు తీసుకుంటున్నారని కాంట్రాక్టుల అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆరోపించారు. శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్లు ధర్నా చేయడాన్ని తప్పు పట్టారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడే కాంట్రాక్టర్లు అధికారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విజయ్‌కుమార్, పట్నం శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు ఆరోపించడంతో కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో మున్సిపల్ ఆఫీసులో అయోమయం నెలకొన్నది. కాంట్రాక్టర్లు టెండర్ల విషయంలో వివరణ ఇవ్వాలని కమిషనర్ సరస్వతి, డీఈ వెంకన్నతో పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూస్తామన్నారు. చాలామంది కాంట్రాక్టర్లు టెండర్ వచ్చిన తర్వాత సక్రమంగా పనులు చేయడం లేదన్నారు. ఆన్‌లైన్‌లో టెండర్ ఎవరికి వస్తే వారికే ఇస్తామన్నారు.

# గది ఒకటే .. తరగతులు ఐదు

- 74 మంది విద్యార్థులకు అందులోనే బోధన
- గదుల్లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- నూతన గది నిర్మాణానికి నిధులు మంజూరు.. నత్తనడకన పనులు
- అధికారులు స్పందించి పనులు త్వరగా జరిగేలా చూడాలి
- విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు



పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కొడంగల్, జూన్ 24 : పట్టణంలోని గాంధీనగర్ వీధిలోని ప్రాథమిక పాఠశాలలో ఒకే తరగతి గదిలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగుతున్నాయి. అందులో దాదాపుగా 74 మంది విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. పాఠశాలకు నూ తన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. ఆ పనులు గత ఎనిమిది నెలలుగా కొనసాగుతున్నాయి. గత దసరా సెలవుల్లో పాత భవనాన్ని కూల్చి.. కొత్త భవన నిర్మాణానికి పనులను ప్రారంభించగా.. అవి ఇంకా పిల్లర్లకే పరిమితమయ్యాయి. వేసవి సెలవుల్లో భవన నిర్మాణం పూర్తైతే.. కొత్త భవనంలో కొత్త విద్యా సం వత్సరం ప్రారంభమవుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఒకే గదిలో 74 మంది విద్యార్థులకు పాఠాలు బోధిస్తే వారికి ఏమి అర్థమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. స్థలం సరిపోకపోవడంతో చాలా మంది విద్యార్థులు పాఠశాలకే రావడంలేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన పాఠశాల నూతన భవనం